సత్యవతి ప్యానెల్ విజయం

ఉత్కంఠగా సాగిన నర్సుల సంఘం ఎన్నికలు

నెల్లూరు(జీజీహెచ్), న్యూస్‌టుడే: నెల్లూరులోని సర్వజన ఆసుపత్రిలో బుధవారం ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు ఉత్కంఠ భరితంగా సాగాయి. అధ్యక్షురాలి పదవికి గతానికి భిన్నంగా వరలక్ష్మి తరపున ఒక ప్యానల్, సత్యవతి తరపున మరొక ప్యానల్‌గా బరిలోకి దిగారు. ఏపీ ఎన్జీవో సంఘం వరద లక్ష్మి ప్యానల్‌కు, ఏపీజీఈబీ సంఘం సత్యవతి ప్యానల్‌కు మద్దతుగా నిలిచాయి. మొత్తం తొమ్మిది మందిని అసోసియేషన్ జిల్లా యూనిట్‌గా ఎన్నుకోవాల్సి ఉండగా- ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు షిఫ్టులుగా ఎన్నికలు నిర్వహించారు. ప్రభుత్వ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా, ఏరియా ఆసుపత్రితో పాటు ప్రభుత్వ సర్వసజన ఆసుపత్రిలో సంఘం సభ్యత్వం ఉన్న వారు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 219 ఓట్లు ఉండగా.. 207 పోలయ్యాయి. కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు మధ్య నెల్లూరు సహకార సహాయ రిజిస్ట్రార్ ఎన్నికలు నిర్వహించారు.

అధ్యక్ష పదవితో సహా... అన్ని పదవులు సత్యవతి ప్యానల్‌నే వరించాయి. అధ్యక్షురాలిగా సత్యవతి, ఉపాధ్యక్షురాలిగా కె.సుమతి, కార్యదర్శిగా వసుంధర, కోశాధికారిగా అరుణకుమారి, ఈసీ సభ్యులుగా నిర్మలజ్యోతి, అజితజోహన్న, విజయమ్మ, లక్ష్మి, వెంకట రాధ గెలిచారు. వరలక్ష్మి ప్యానల్ తరపున పోటీ చేసిన ఒక్కరూ గెలవలేదు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సతీమణి చిట్టెమ్మ సైతం ఈ ప్యానల్ తరపున ఉపాధ్యక్షురాలిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు.



ఎన్నికల ప్రక్రియ

ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం అక్టోబరు 24, 2024

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ఆర్ఐవో శ్రీనివాసులు

సంగం, న్యూస్‌టుడే: జిల్లాలో 53వేల మంది విద్యార్థులు ఇంటర్ విద్యాభ్యాసం చేస్తున్నట్లు ఆర్ఐవో శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన సంగం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న హైస్కూల్ ప్లస్ తరగతులను పరిశీలించారు. జిల్లాలో హైస్కూల్ ప్లస్ 38 ఉన్నత పాఠశాలల్లో మంజూరు కాగా.. గత విద్యా సంవత్సరంలో 11 మాత్రమే ప్రారంభమయ్యాయన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇస్కపల్లి, అనంతసాగరం, నరసాపురం, గాంధీజనసంఘం, బోగోలులో ప్రారంభమయ్యాయన్నారు. మొత్తం 16 చోట్ల 541 మంది విద్యాభ్యాసం చేస్తున్నట్లు తెలిపారు. వాటిలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పూర్వ విద్యార్థులు, దాతలు కృషి చేయాలన్నారు. ఈ ఏడాది ప్రారంభించిన కళాశాలల్లో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులే బోధిస్తున్నారని, మిగిలిన వాటిలో ప్రత్యేకంగా అధ్యాపకులు ఉన్నారన్నారు. గతంలో కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే ఉచితంగా ఇచ్చామని, ఈసారి రాత పుస్తకాలు, సంచులు ఇవ్వడం విశేషమన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు పి.బుజ్జయ్య హాజరయ్యారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు

అర్హులకు భరోసా!

పింఛన్ల మంజూరుకు వేల మంది నిరీక్షణ

ఎంపిక.. ఏరివేతకు త్వరలో మార్గదర్శకాలు



వృద్ధురాలికి పింఛను అందిస్తున్న సచివాలయ కార్యదర్శి (పాతచిత్రం)

కందుకూరు పట్టణం 24వ వార్డుకు చెందిన ఇంటూరి వెంకటేశ్వర్లు టైలరింగ్ చేసేవారు. పిల్లలు లేరు. రెండేళ్ల కిందట భార్య మృతి చెందారు. గత ఏడాది వెంకటేశ్వర్లుకు పక్షవాతం వచ్చింది. జీవనం కష్టతరమైన తరుణంలో స్థానికుల సాయంతో సదరమ్ ధ్రువీకరణ పత్రం పొంది.. పింఛను కోసం గత ఏడాది సెప్టెంబరులో దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైందని, 2024, జనవరి ఒకటో తేదీన అందిస్తామని చెప్పినా.. నగదు మంజూరు చేయలేదు. నేటికీ ఎదురు చూస్తూనే ఉన్నారు.

పట్టణంలోని 23వ వార్డుకు చెందిన షేక్ అలియాస్ వితంతు పింఛనుకు, షేక్ అల్లాభక్షు వృద్ధాప్య పింఛనుకు దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది అక్టోబరులో దరఖాస్తు చేసుకోగా.. పింఛను మంజూరు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ లాగిన్‌లో స్టేటస్ చూపుతోంది. కానీ, ఇప్పటి వరకు పింఛను నగదు ఇవ్వలేదు.

పామూరు రోడ్డుకు చెందిన వలేటి పద్మ, డీవీనగర్‌కు చెందిన గోరంట్ల పద్మ వితంతు పింఛనుకు దరఖాస్తు చేసుకుని దాదాపు ఏడాది అవుతోంది. మంజూరు చేయలేదు. ఏ కారణంతో ఇవ్వడం లేదో కూడా చెప్పడం లేదని వాపోతున్నారు. ఇలా ఎంతో మంది అర్హత ఉన్నా.. పింఛను అందక ఏడాదిగా ఎదురు చూపులు చూస్తున్నారు.

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే

ఎన్టీఆర్ భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే కొత్త పింఛన్లు మంజూరు చేయనుంది. అందుకు సంబంధించిన కసరత్తు ఇప్పటికే మొదలైంది. వైకాపా హయాంలో అర్హతలు ఉండీ.. మంజూరు కాని వారు కొందరైతే.. మరికొందరు నకిలీ ధ్రువపత్రాలతో పింఛన్లు పొందారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అనర్హులను ఏరివేసి.. అర్హులకు భరోసా కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు త్వరలోనే మార్గదర్శకాలు విడుదలకానున్నాయి.

జిల్లాలో 3,09,711

జిల్లాలో మొత్తం 3,09,711 పింఛన్లు ఉండగా- కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వృద్ధులు, వితంతువులకు రూ. 4వేలు, దివ్యాంగులకు రూ. 6వేలు, పూర్తిగా మంచంలో ఉన్నవారికి రూ. 15వేలు చొప్పున అందిస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండుసార్లు జనవరి, జులైలో మాత్రమే పింఛన్లు మంజూరు చేశారు. 2023 జులైలో మాత్రమే కొత్తవి మంజూరు చేశారు. 2024 జనవరి ఒకటో తేదీ అరకొరగానే విడుదల చేశారు. మే వరకు ఊసే లేదు. జులైలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. గత ఏడాది జులై తర్వాత.. ఈ ఏడాది అక్టోబరు వరకు కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. జిల్లాలో సుమారు 15వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి పింఛన్ల కోసం భారీగానే దరఖాస్తులు అందాయి. 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకూ మంజూరు చేస్తారని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొత్త పింఛన్ల మంజూరుకు విధి విధానాల రూపకల్పన కోసం మంత్రులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. నవంబరులో దరఖాస్తులు స్వీకరించడంతో పాటు అదే నెలలో తనిఖీలు నిర్వహించనున్నారు. ఆ జాబితాలో సమస్యలు ఉన్నవారు ఫిర్యాదు చేస్తే.. పునః పరిశీలించి ఎంపిక ప్రక్రియ పూర్తి చేయనున్నారు. మొత్తంగా డిసెంబరు నెలాఖరుకు కొత్త పింఛన్ల లబ్ధిదారుల ఎంపిక, ప్రస్తుత పింఛన్లలో అనర్హుల ఏరివేత పూర్తి చేయనున్నట్లు తెలిసింది.

విధి విధానాలు వచ్చాక..

కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు అందలేదు. విధి విధానాలు వచ్చాక.. అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి మంజూరు చేస్తారు. తదనుగుణంగా అనర్హులనూ తొలగిస్తాం. – కె. అనూష, మున్సిపల్ కమిషనర్, కందుకూరు



భూసార పరీక్ష ఫలితాల పత్రాన్ని అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

అయిదు లక్షల ఎకరాల్లో సాగు

జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి

సంగం, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ సీజన్‌లో అయిదు లక్షల ఎకరాల్లో పంటల సాగు జరగనుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి తెలిపారు. బుధవారం ఆమె సంగం మండలం పడమటిపాళెంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సోమశిల జలాశయంలో నీరు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో.. నాలుగు లక్షల ఎకరాల్లో వరి, లక్ష ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతాయన్నారు. సెప్టెంబరు నెలలో వర్షాలు లేనందున కంది, మినుము, పెసర సాగు తగ్గిందన్నారు. జిలకర మసూరి రకం వరిని నవంబరు 15వతేదీలోపు మాత్రమే నాటుకోవాలని, ఆ తర్వాత నాటితే అగ్గితెగులుతో పాటు పలు రకాల తెగుళ్లు వ్యాపిస్తాయని హెచ్చరించారు. నవంబరు ప్రారంభం నుంచి కె.ఎన్.ఎం. 1638, షుగర్‌లెస్ రకం వంగడాల నార్లు పోసుకోవాలని సూచించారు. వాటిని 25 రోజుల్లోపు నాటుకోవాలని తెలిపారు. పంటల సాగుకు రెండు లక్షల టన్నుల రసాయన ఎరువులు అవసరమని, ఏ నెలకు ఏ మేరకు కావాలో ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రభుత్వానికి పంపించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ సుజాత, శేషగిరిరావు, మండల వ్యవసాయాధికారి శ్రీహరి పాల్గొన్నారు.

ఎస్ఎల్‌వీ క్రషర్స్ యాజమాన్యంపై కేసు

స్పందనకు వందనం

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరు మండలం పులిగిలపాడు సమీపంలోని ఎస్ఎల్‌వీ స్టోన్ క్రషర్స్ యాజమాన్యంపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తహసీల్దారు లక్ష్మీనరసింహం తెలిపారు. సీజ్ చేసిన క్వారీ నుంచి అక్రమంగా ఖనిజం తరలిస్తున్న వైనంపై ఈ నెల 22న 'కాజేస్తున్నా.. కనరంతే' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన రెవెన్యూ అధికారులు క్రషర్‌తో పాటు క్వారీలను పరిశీలించారు. క్రషర్స్ సీజ్ చేసినప్పుడు ఉన్న నిల్వకు.. ప్రస్తుతానికి తేడా ఉండటంతో చర్యలకు ఉపక్రమించినట్లు తహసీల్దారు వెల్లడించారు. ఆ మేరకు రాపూరు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. దాంతో యజమానిపై కేసు నమోదైందని వెల్లడించారు.




భూగర్భ వంతెన.. ఇక్కట్లు ఈ వంతున

నెల్లూరు- అల్లూరు మార్గంలో నార్తురాజుపాలెం పరిధిలోని టపాతోపులో నిర్మించిన భూగర్భ రైల్వే వంతెన వాహనదారులకు చుక్కలు చూపుతోంది. వంతెన దాటగానే మలుపు ఉండటం.. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం.. ఇక వర్షం కురిస్తే మొత్తం నీటితో నిండిపోవడం తదితరాలతో ఇక్కట్లు తప్పడం లేదు. ఈ క్రమంలో నార్తురాజుపాళెం రైల్వే గేటు మీదుగా అధికంగా వాహనాలు వెళ్లడం.. సమస్యను జటిలం చేస్తోంది. – ఈనాడు, నెల్లూరు



నిర్వహణ కరవై.. ఆహ్లాదం ఆవిరై..

నెల్లూరులోని బారాషహీద్ దర్గా స్వర్ణాల చెరువు ఘాట్ కళా విహీనంగా తయారైంది. మూడు నెలల క్రితం జరిగిన రొట్టెల పండగ సమయంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. 24 గంటలు పర్యవేక్షించారు. భక్తులు భారీగా వచ్చి సేద తీరారు. ఆహ్లాదం కోసం నగరవాసులు సాయంత్రం వేళ పెద్దసంఖ్యలో వచ్చేవారు. రొట్టెల పండగ ముగిసిన తర్వాత నగరపాలక అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఘాట్ గుర్రపు డెక్క, వ్యర్థాలతో నిండి దుర్గంధంగా తయారైంది. సాయంత్రం సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి సేదతీరే నగరవాసులు దుర్గంధం భరించలేకపోతున్నారు. – ఈనాడు, నెల్లూరు



శిథిల భవనం.. అవస్థలు అనేకం

కొడవలూరులోని పశువుల ఆసుపత్రి ఇది. భవనం పూర్తి శిథిలావస్థకు చేరింది. ఇప్పటికే పలుమార్లు అధికారులకు సమస్యను విన్నవించారు. పరిశీలించి వెళ్లారేగానీ.. మార్పురాలేదు. గతంలో రోడ్డుకు అటువైపు స్థలం కేటాయించగా.. పనులు మొదలుపెట్టేలోపే ఆగిపోయింది. ఇటీవలి తుపాను వర్షాలతో గోడలన్నీ చెమ్మపట్టి.. పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయి. – ఈనాడు నెల్లూరు.

తప్పు తేలుస్తారా తప్పిస్తారా?

32.51 ఎకరాల ప్రభుత్వ భూమికి అక్రమ రిజిస్ట్రేషన్



అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిన భూమి

దుత్తలూరు, న్యూస్‌టుడే: కొందరు రెవెన్యూ సిబ్బంది, మండలానికి చెందిన కొందరు వ్యక్తులు కుమ్మక్కయ్యారు. ఏకంగా 32 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమికి ఎసరుపెట్టారు. దాన్ని అడంగల్, 1బీలో నమోదు చేయడంతో పాటు ఏకంగా రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ఆ బాగోతం కాస్తా బయటపడి.. సదరు ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కొందరు స్థానికులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఫలితం లేకుండా ఉంది. దీంతో తప్పు తేలుస్తారో? తప్పిస్తారో? అన్న విమర్శలు నెలకొన్నాయి.

ఇదీ సంగతి

దుత్తలూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 448-1లో మొత్తం 141.16 ఎకరాల భూమి గర్భకండ్రికగా నమోదై ఉంది. ప్రభుత్వ భూమి కావడంతో అమ్మడం, కొనడం నిషేధం. కానీ, దుత్తలూరుకు చెందిన కొందరు ఈ భూములపై కన్నేశారు. 2021లో నాటి కొందరు రెవెన్యూ సిబ్బందితో కథ నడిపించారు. అంతే, వారసత్వం కింద షేక్ జమీరుద్దీన్ పేరు మీద 12.51 ఎకరాలు, షేక్ మహమ్మద్ హుసేన్ పేరుతో మరో 20 ఎకరాలు రెవెన్యూ దస్త్రాల్లో నమోదు చేశారు. పాస్ పుస్తకాలు సైతం పొందారు. వాటి ఆధారంగా ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు.

విలువ.. రూ. నాలుగు కోట్ల పైమాటే

తతంగం వెలుగులోకి రావడంతో.. నాటి కావలి ఆర్డీవో శీనానాయక్ విచారణ జరిపారు. రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి తహసీల్దారు డిజిటల్ సైన్ నిలిపివేయడంతో పాటు సదరు భూమిని రెడ్ మార్కులో పెట్టారు. ఆ పరిణామాలతో కొద్దిరోజులు స్తబ్దుగా ఉన్న అక్రమార్కులు.. అనంతరం రెడ్ మార్క్ తొలగించగానే.. గత ఏడాది సెప్టెంబరులో ఏకంగా 32.51 ఎకరాలకు ముందు నమోదు చేసిన వ్యక్తులతో సంబంధం లేకుండా.. అదే పేరు మీద మరో వ్యక్తిని సృష్టించి.. కడప జిల్లా ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ ప్రక్రియ మొత్తం కొందరు రెవెన్యూ సిబ్బంది కనుసన్నల్లోనే జరిగినట్లు విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ. 4 కోట్లకుపైగానే పలుకుతోంది.

ఆధారాలతో..

ఈ భూ అక్రమాలపై గతంలోనే పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పెద్ద మొత్తంలో చేతులు మారడంతో పాటు ఏకంగా కడప జిల్లాలో రిజిస్ట్రేషన్ చేయడం వెనుక ఎవరి పాత్ర ఉందో తేల్చాలని కోరుతున్నారు. అడంగల్, 1 బీలో నమోదైన షేక్ మహ్మద్ హుస్సేన్, షేక్ ఖలీల్ అనే వ్యక్తులు ఎవరనేది విచారణలో తేలాల్సి ఉందంటున్నారు.

నోటీసులు జారీ చేస్తున్నాం

అడంగల్‌లో నమోదుతో పాటు గర్భకండ్రిక భూమికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం ఇటీవలే నా దృష్టికి వచ్చింది. దీనికి సంబంధించి.. అందరికీ నోటీసులు జారీ చేస్తున్నాం. పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. – నాగరాజు, తహసీల్దారు, దుత్తలూరు

ర్యాగింగ్ భూతం.. చేద్దాం యుద్ధం

ప్రభుత్వ వైద్య కళాశాలలో కమిటీ



న్యూస్‌టుడే, నెల్లూరు (జీజీహెచ్)

ర్యాగింగ్.. సరదా పేరుతో మొదలై, ప్రాణాలపైకి తెస్తున్న ఈ వికృత పోకడలు జిల్లాలోనూ అప్పుడప్పుడూ వెలుగు చూస్తూనే ఉన్నాయి. దీని కారణంగా ఎంతో మంది ప్రాణాలు తీసుకుంటుండగా- మరెంతో మంది చదువులకు దూరమవుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైద్య కళాశాల అధికారులు అప్రమత్తమయ్యారు. ఫిర్యాదుల నేపథ్యంలో.. ఆ భూతానికి అడ్డుకట్ట వేసేందుకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పకడ్బందీ చర్యలు చేపట్టారు.

ఫిర్యాదుల నేపథ్యంలో...

ఈ నెల 14వ తేదీ నుంచి ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. మొత్తం 175కు.. 172 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. మరో ముగ్గురు హాజరుకావాల్సి ఉంది. ఇంతలోనే ర్యాగింగ్ మాట వినిపించింది. సీనియర్లు.. ర్యాగింగ్ చేస్తున్నారన్న ప్రచారంతో పాటు ఫిర్యాదుల వరకు పరిస్థితి వెళ్లింది. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఇదే విషయమై అధ్యాపకులను కలిశారు. దాంతో యాంటీ ర్యాగింగ్ కమిటీని తెరపైకి తెచ్చారు. దాని ద్వారా విద్యార్థుల్లో మనోస్థైర్యం నింపేందుకు నడుం కట్టారు. కళాశాలలో ర్యాగింగ్ అనే పదం వినిపించినా చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. దాని వల్ల కలిగే అనర్థాలు, తీసుకునే చర్యలు తెలిపే పోస్టర్లను కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశారు.

> అధ్యాపకులు, న్యాయవాది, పోలీసులు, తల్లిదండ్రులు, మీడియా నుంచి కొందరిని ఎంపిక చేసుకుని కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. గతంలోనే ఈ కమిటీ ఉన్నా.. అంతగా పట్టించుకోలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో పకడ్బందీ చర్యలు చేపట్టారు.

> జూనియర్లలో మనోధైర్యం నింపుతూనే.. సుతిమెత్తగా సీనియర్లకు హితబోధ చేస్తూ.. ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలను వారికి వివరిస్తున్నారు. వైద్యులు కావాల్సిన వయసులో క్రిమినల్‌గా మారుతారా? అంటూ వారిలో ఆలోచనలు నాటుతున్నారు.

పక్కాగా నిర్వహణ..

పరిణామాలు విద్యార్థులకు వివరించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా జరిగితే.. ధైర్యంగా చెప్పేలా జూనియర్లలో మనోస్థైర్యం నింపుతున్నాం. క్షేత్రస్థాయి పరిశీలనకు స్క్వాడ్ డ్యూటీలు వేశాం. మహిళా సిబ్బంది అమ్మాయిల హాస్టల్, పురుష సిబ్బంది అబ్బాయిల హాస్టళ్లలో తనిఖీలు చేయాల్సి ఉంది. అక్కడ పుస్తకం ఏర్పాటు చేశాం. విద్యార్థులతో మాట్లాడి.. పుస్తకంతో సంతకం చేయాల్సి ఉంటుంది. ఇది నిత్య ప్రక్రియ. – డాక్టర్ గోవిందు, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల

వీరవిధేయుడిపై వేటు!

తహసీల్దారును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

పొదలకూరు, అనంతసాగరం, న్యూస్‌టుడే: అనంతసాగరం మండల తహసీల్దారు వీర వసంతరావుపై వేటు పడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైకాపా పాలనలో పొదలకూరు తహసీల్దారుగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో వైకాపా నాయకులు, వారి బంధువులకు ప్రభుత్వ భూములను కట్టబెట్టారనే ఆరోపణలు ఉండగా- జేసీతో పాటు ఉన్నతాధికారులు పలుమార్లు పొదలకూరు కార్యాలయంలో దస్త్రాలు పరిశీలించి.. అక్రమాలు నిగ్గు తేల్చారు. ఆ క్రమంలోనే వీర వసంతరావుపై వేటు పడగా- వైకాపా పాలనలో అక్రమార్కులకు సహకరించిన వారిలో ఆందోళన మొదలైంది.

ఆరోపణల వెల్లువ..

వైకాపా పాలనలో పొదలకూరు తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ.. అసైన్డ్ భూముల రివ్యూ కమిటీ అనుమతి లేకుండా, వీఆర్వో, ఆర్ఐలకు చెప్పకుండా, ఉన్నతాధికారులను సంప్రదించకుండా వందల ఎకరాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. మరువూరులో నకిలీ పట్టాలు సృష్టించి.. గ్రామంలో లేని వారి పేర్లతో భూముల పందేరం చేశారని, ఆదాయ పన్ను చెల్లించే వారికి భూములు మంజూరు చేయడంతో పాటు పులికల్లులో 40 ఎకరాలు, ప్రభగిరిపట్నంలో 28 ఎకరాలు, వావింటపర్తిలో 11.38 ఎకరాల కాలువ(వాగు) పోరంబోకు భూమితో పాటు పదుల ఎకరాల్లో పశువుల మేత కోసం వదిలేసిన భూములు సాగులో ఉన్నట్లు చూపి పలువురికి కట్టాబెట్టారని, ఇనుకుర్తిలో కొండ పోరంబోకు, కోర్టు వివాదంలో ఉన్న భూములను సైతం పంపిణీ చేశారని ఆరోపణలు ఉన్నాయి. సూరాయపాళెంలో 34 ఎకరాల మేత పోరంబోకును భూస్వాములకు పంపిణీ చేశారని తెదేపా నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



వీరవసంతరావు

గతంలోనూ.. ఇక్కడ

గత ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే పొదలకూరు తహసీల్దారుగా స్వాతి అనేక భూ అక్రమాలకు పాల్పడ్డారు. ప్రభుత్వ భూముల మ్యుటేషన్, క్లాసిఫికేషన్లు మార్చే లాగిన్ తహసీల్దార్లకే ఉండటంతో విచ్చలవిడిగా అక్రమాలు జరిగాయి. ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల పేర్లు చేర్చడంతో పాటు పట్టా భూములను ఇష్టానుసారంగా మార్చేశారు. వీటిపై విచారణ చేసేందుకు ఎనిమది మంది తహసీల్దార్లను నియమించారు. వారి విచారణలో పలు అక్రమాలు తేలడంతో అప్పటి తహసీల్దారు స్వాతిని సస్పెండ్ చేశారు.



ఈచిత్రంలో ఉన్న అధికారి నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి చైతన్య. ఈయన పరిశీలిస్తున్న తీరు చూస్తే అదేదో ముఖ్యమైన కాగితం అనుకుంటారు. కానీ అవి ఆసుపత్రుల్లో రోగుల ఓపీ చీటీలు. చెత్తలో కనిపించగా ఇలా చూస్తున్నారు. బుధవారం నగరంలోని అల్లీపురంలోని డంపింగ్ యార్డులో ఉన్న వాటిని పరిశీలించారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)



గండిపాళేనికి జలకళ..

పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాళెం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరుతుండడంతో జలకళ సంతరించుకుంది. పూర్తి నీటి సామర్థ్యం 35 అడుగులు కాగా 12 అడుగులకు నీటి నిల్వ చేరినట్లు జలవనరుల శాఖ డీఈఈ చంద్రమౌళి బుధవారం తెలిపారు.

– న్యూస్‌టుడే, ఉదయగిరి



రాళ్లపాడుకు లీకుల బెడద

రాళ్లపాడు జలాశయం పాత స్పిల్‌వేలోని 8 గేట్ల నుంచి నీరు లీకవుతుండటంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి మట్టం పెరిగే కొద్దీ లీకులు అధికమవుతున్నాయి. గేట్లుకు, సిమెంట్ దిమ్మెలకు మధ్య ఉన్న రంబరు సీలు మరమ్మతులకు గురి కావడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. వృథా నీరంతా దిగువనున్న మన్నేరులో కలుస్తోంది. ప్రస్తుతం నీటి మట్టం 17.1 అడుగులకు చేరింది. జేఈ చంద్రమౌళి మాట్లాడుతూ రెండు రోజుల్లో లీకులను అరికడతామన్నారు.

– న్యూస్‌టుడే, లింగసముద్రం



వేడుకల్లో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు, చిత్రంలో సీఎం రమేష్, కామినేని శ్రీనివాసరావు

వెంకయ్యనాయుడు మనవడి నిశ్చితార్థ వేడుకల్లో ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మనవడు విష్ణు, సాయి సాత్విక నిశ్చితార్థ వేడుకల్లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు బుధవారం పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లేబూరులో భూమిని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జేసీ కార్తిక్

పంచాయతీ తీర్మానం లేకుండా సిఫార్సుపై ఆగ్రహం

స్పందనకు వందనం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: విలువైన ప్రభుత్వ భూమిని కారుచౌకగా ఒక నాయకుడికి కట్టబెట్టేందుకు ప్రయత్నించిన వైనంపై జేసీ కార్తిక్ స్పందించారు. 'ఈనాడు'లో బుధవారం 'లేబూరులో భూమాయ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. లేబూరులో జేసీ పర్యటించి 360-1ఏలోని 1.83 ఎకరాల భూమిని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. గ్రామస్థుల అభ్యంతరాలున్నా పంచాయతీ తీర్మానం లేకుండా భూమి అమ్మకానికి ఎలా సిఫార్సు చేస్తారంటూ అధికారులపై మండిపడ్డారు. పంచాయతీ తీర్మానం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. తక్షణమే తిరస్కరిస్తున్నట్లు చెప్పడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

డిగ్రీ పరీక్షలకు 206 మంది గైర్హాజరు

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూ పరిధిలో బుధవారం జరిగిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 4021 మంది విద్యార్థులకు 3815 మంది హాజరుకాగా 206 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి మధుమతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదాయం లేని ఆలయాలకు ఊరట లభించింది. ధూప, దీప నైవేద్యాలకు నెలవారీ ఇచ్చే నగదును రూ. 10 వేలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లపాటు వీటి నిర్వహణను పట్టించుకోలేదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిపై దృష్టి సారించింది. ఇప్పటివరకు నెలకు రూ. అయిదు వేల వంతున అందించే సాయాన్ని రూ.10 వేలకు పెంచడంపై అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చిన్న ఆలయాలకు పెద్ద సాయం..

ధూప, దీప నైవేద్యాలకు నెలకు రూ. 10 వేలు

న్యూస్‌టుడే, దుత్తలూరు

ఉదయగిరి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం, ఆస్తిపాస్తులు లేని ఆలయాలు 69 వరకు ఉన్నాయి. ఆలనాపాలనా లేక ఇవి నిరాదరణకు గురవుతున్నాయి. వాటిని పునరుద్ధరించేందుకు 2007లో డీడీఎన్ (ధూప, దీప, నైవేద్యం) పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పట్లో నియోజకవర్గం నుంచి 25 దరఖాస్తులు వెళ్లగా అధికారులు తొమ్మిందింటిని ఎంపిక చేశారు. వాటిల్లో ఒక్కో ఆలయానికి ప్రతి నెలా రూ. 2,500 వంతున ఆర్థిక సాయం అందించేవారు. అందులో అర్చకుల జీవన భృతికి రూ. 1500 మిగతా రూ. వెయ్యి ధూపదీప నైవేద్యాలకు వినియోగించేవారు.

రెండు సార్లు పెంపు..

ఆరేళ్ల కిందట తెదేపా హయాంలోనే ఈ పథకం ద్వారా ఇచ్చే మొత్తాన్ని రూ. 2,500 నుంచి రూ. 5 వేలకు పెంచారు. అందులో అర్చకులకు రూ. 2,500 ఇచ్చే వారు. ఇలా నియోజకవర్గంలో తొమ్మిది ఆలయాలకు సాయం అందేది. అలా ఎంపిక చేసిన దేవాలయాలకు ప్రతి నెలా రూ. 5 వేల వంతున సాయం అందేది.

తాజాగా కూటమి ప్రభుత్వం ఆ సాయాన్ని రూ. 10 వేలకు పెంచింది. ఈ సాయంలో అర్చకులకు రూ. 7 వేలు, ఇతర ఖర్చులకు రూ. 3 వేలు వంతున కేటాయించారు. దీన్ని దేవాదాయ శాఖకు చెందిన సర్వశ్రేయనిధి (సీజీఎఫ్) నుంచి అర్చకుల పేరిట ఉన్న బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీంతో చిన్న ఆలయాలపై ఆధారపడి జీవిస్తున్న అర్చకులు ప్రతినెలా రూ. 4,500 అదనంగా అందుకోనున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే వాటికి ఈ పథకం వర్తించదు.

పక్కాగా కార్యక్రమాలు

జనార్దన్‌రెడ్డి, జిల్లా సహాయ కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ

దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉండే దేవాలయాల్లో నిత్యం ధూప, దీప, నైవేద్యాల కార్యక్రమాలు పక్కాగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఎంపిక చేసిన దేవాలయాల్లో నెలకు రూ. 5 వేల వంతున సాయం అందిస్తున్నారు. ఆ సాయాన్ని రెట్టింపు చేసి రూ. 10 వేలకు పెంచింది. ఈ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న ఆలయాలకు లబ్ధి చేకూరనుంది.

వేటికిస్తారంటే..

- 25 ఏళ్ల క్రితం నిర్మించి దేవాదాయ శాఖ చట్టం పరిధిలో ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో పురాతన ఆలయాలకు ప్రాధాన్యం ఇస్తారు.
- 2.5 ఎకరాల్లోపు చిత్తడి లేదా ఐదెకరాల్లోపు మెట్ట భూమి ఉండి ఏడాదికి రూ. 30 వేలలోపు ఆదాయం సమకూరేవి.
- పూజారుల ఆధ్వర్యంలో నిత్య కైంకర్యాలు జరిగే గ్రామ దేవత దేవాలయాలను పరిగణనలోకి తీసుకుంటారు.
- పెంచిన మొత్తం ప్రతినెలా అర్చకుల ఖాతాలో జమ అవుతోంది. ప్రభుత్వం అందించే రూ. 10 వేల సాయంలో అర్చకులకు రూ. 7 వేలు, ఆలయాలకు ఖర్చులకు రూ. 3 వేలు వంతున కేటాయించారు.



బీపీటీ ధాన్యం @ రూ.29వేలు

కోవూరు, న్యూస్‌టుడే: జిల్లాలో బీపీటీ ధాన్యానికి భారీగా మద్దతు ధర లభించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కోవూరు డెల్టా పరిధిలో అన్నదాతలు పుట్టి రూ. 29 వేలకు విక్రయిస్తున్నారు. ఇటీవల ధాన్యానికి కనీస మద్దతు ధర లేక పోవడంతో తీవ్రంగా నష్టపోయారు. నెల రోజుల క్రితం రూ. 19 వేల నుంచి రూ. 22 వేల వరకు ఉండగా నేడు రూ. 29 వేలకు పెరిగింది. చాలా మంది రైతులు తక్కువ ధరకే విక్రయించి నష్టపోయామని వాపోతున్నారు. కొందరు రైతులు ధరలు సరిగా లేనప్పుడు నిల్వ ఉంచుకున్నారు. నెల రోజుల వ్యత్యాసంలో పుట్టికి అదనంగా రూ. 7 నుంచి రూ. 10 వేల వరకు ఆదాయం లభించడంతో ప్రస్తుతం విక్రయించిన వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,560
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 60,480
వెండి గ్రాము :	రూ. 104.90

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	124
రిటైల్	146
లేయర్	115
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	241
లేయర్ మాంసం	195
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	132
లేయర్	115
బ్రాయిలర్స్	236
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	262
లేయర్ మాంసం	195

నేత్రదానం.. సేవా సంకల్పం

న్యూస్‌టుడే, విడవలూరు, కొడవలూరు

ఆపదలో ఉన్న వారికి సాయం చేసే మనసు అందరికీ ఉంటుంది... కానీ ఆ దిశగా అడుగేసే వారు కొందరే ఉంటారు.. వీరిలో రెండో కోవకు చెందిన వారే విడవలూరుకు చెందిన దేవళ్ల శ్రీనివాసులురెడ్డి.. రైతు కుటుంబానికి చెందిన ఆయన పన్నెండేళ్ల క్రితం సోదరుడితో కలిసి మనసేవా సంస్థ ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ముఖ్యంగా నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి వారి కార్నియాను సేకరిస్తున్నారు. ఎంతో మంది చూపులేని నిరుపేదలకు సేవా సంస్థ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి వారి కళ్లలో వెలుగులు నింపుతూ పలువురి మన్ననలు పొందుతున్నారు. సోదరుడు యానాదిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శ్రీనివాసులురెడ్డి సేవా కార్యక్రమాలకు ఆటంకం లేకుండా కొనసాగిస్తున్నారు.

▼ అన్నారెడ్డిపాళేనికి చెందిన శ్రీనివాసులు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి కళ్లు కనిపించవని, మనసేవా సంస్థ ద్వారా శస్త్రచికిత్స చేయించారన్నారు. ప్రస్తుతం చూడగలుగుతున్నా నా పనులు నేను చేసుకోగలుగుతున్నామన్నారు.



మనసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం



విడవలూరు డిగ్రీ కళాశాలలో నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

సంస్థ చేస్తున్న కార్యక్రమాలు..

- 2012 నుంచి ప్రస్తుతేడాది సెప్టెంబరు వరకు 131 మంది చేత స్వచ్ఛందంగా నేత్రదానం చేయించి 162 జతల కళ్లను సేకరించారు.
- 400కు పైగా నిరుపేదలకు కంటి అద్దాల పంపిణీతో పాటు పలువురికి నేత్ర శస్త్రచికిత్సలు చేయించారు.
- నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి వైద్య నిపుణుల పర్యవేక్షణలో దాతల వద్ద నేత్ర దాన అంగీకార పత్రాలు తీసుకున్నారు.

అంధ రహిత సమాజమే లక్ష్యం

దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, మనసేవా సంస్థ నిర్వాహకులు

తల్లిదండ్రులు దేవళ్ల పుల్లారెడ్డి, వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి స్ఫూర్తితో మన సేవాసంస్థ ఏర్పాటు చేశాం. అంధులు పడే కష్టాలు చూసి చలించి వారికి తోడ్పాటు అందించాలని తల్లిదండ్రులు చెప్పేవారు. వారి స్ఫూర్తితో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి ఎవరైనా మరణిస్తే వారి కళ్లు మట్టిలో కలిసిపోకుండా కార్నియాను సేకరించి చూపులేని వారికి వెలుగులు నింపడమే సంస్థ లక్ష్యం.

రైళ్లలో నిఘా పెంచండి: రాహుల్ మీనా

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రైళ్లలో నిఘా పెంచి.. నేరగాళ్ల కదలికలపై సమాచారం ఉండాలని గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రైల్వే సీఐ కార్యాలయంలో రైల్వే సబ్ డివిజన్ పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. పలు కేసుల పెండెన్సీ, దొంగతనాలు, దోపిడీ కేసుల్లో దర్యాప్తుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతకు రైళ్లలో గస్తీ పెంచాలన్నారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. దోపిడీ, దొంగతనాల కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తిచేసి చోరీ సొత్తు రికవరీ చేయాలన్నారు. అనంతరం నెల్లూరు రైల్వే పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. సమావేశంలో నెల్లూరు, ఒంగోలు రైల్వే సీఐలు భుజంగరావు, షరీఫ్, సూళ్లూరుపేట, నెల్లూరు, ఒంగోలు, చీరాల ఎస్సైలు చెన్నకేశవరావు, మాలకొండయ్య, అరుణ కుమారి, కొండయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైల్వే ఎస్పీ రాహుల్ మీనా



ఎమ్మెల్యే కాకర్లకు చెక్కు అందజేస్తున్న తెదేపా నాయకులు

వరద బాధితులకు రూ. 6.50 లక్షల విరాళం

వరికుంటపాడు, వింజమూరు : వరద బాధితులకు వరికుంటపాడు మండల తెదేపా నాయకులు రూ. 6.50 లక్షల విరాళం అందజేశారు. వింజమూరులో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు పార్టీ మండల కన్వీనర్ చంద్రామధుసూదన్‌రావు చెక్కును అందచేశారు. వెంకయ్య, లక్ష్మీనారాయణ, మహేష్, మాధవరావు, వెంగళరావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రతిభ భేష్

వెంకటాచలం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ విస్తృతంగా పాల్గొనాలని వీఎస్‌యూ రిజిస్ట్రార్ సునీత సూచించారు. వీఎస్‌యూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ముందస్తు గణతంత్ర దినోత్సవ క్యాంపులో పాల్గొనేందుకు బుధవారం విద్యార్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ మాట్లాడుతూ... ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రతిభ బాగుందని ప్రశంసించారు. రెండేళ్లలో రెండు రాష్ట్రపతి అవార్డులు, నాలుగు రాష్ట్ర స్థాయి అవార్డులు వీఎస్‌యూకు రావడం ఆనందంగా ఉందన్నారు.



సీసీ కెమెరాలో నమోదైన నిందితుడి చిత్రం

టీచర్‌నని చెప్పి.. బంగారంతో ఉడాయించి

సీతారామపురం : తన పేరు రఘు అని, సీతారామపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నానని కమ్మలు, ఉంగరాలు చూపించాలని ఓ బంగారు దుకాణ యజమానిని నమ్మించి బంగారంతో ఉడాయించిన సంఘటన సీతారామపురంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలో తెదేపా నాయకుడు దేవర వెంకటేశ్వర్లు బంగారు దుకాణం నిర్వహిస్తున్నారు. దుకాణంలో బుధవారం ఆయన భార్య సుభాషిణి, తమ్ముడు కిరణ్ ఉన్నారు. ఉదయం 10.30 ప్రాంతంలో ఓ వ్యక్తి వచ్చి ఉపాధ్యాయుడినంటూ పరిచయం చేసుకున్నాడు. పాఠశాలలో ఉద్యోగ విరమణ కార్యక్రమం ఉందని చెప్పి కమ్మలు, ఉంగరాలు చూపించామని అడిగారు. దుకాణ యజమాని వెంకటేశ్వర్లు లేరా అని అడిగారు. ఆ సమయంలో దుకాణం నుంచి కిరణ్ వెళ్లిపోయిన విషయం గమనించి.. బంగారు వస్తువులు ఇస్తే పాఠశాలలో టీచర్లకు చూపించి తీసుకువస్తానని నమ్మించాడు. దీంతో ఆమె 16.5 గ్రాముల విలువ గల రెండు జతల కమ్మలు, రెండు ఉంగరాలను ఇచ్చారు. వెంటనే తేరుకుని కూమార్తెను పాఠశాలకు పంపించారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెట్రోల్‌బంకులో నిందితుడు పెట్రోల్ పోయించుకున్నట్లు సీసీ కెమెరాలో నమోదైంది. బంగారం విలువ రూ1.40 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు.

కోవూరులో అవినీతి జలగ

లబోదిబోమంటున్న విశ్రాంత ఉద్యోగులు

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరులో ఒక ప్రభుత్వ అధికారి వసూళ్లతో ఉద్యోగులు లబోదిబోమంటున్నారు. అందినకాడికి దండుకుంటూ అవినీతి జలగలా మారారన్న విమర్శలు నెలకొన్నాయి. బయట ఎవరికైనా చెపితే ఎక్కడ ఇబ్బందులకు గురి చేస్తారోనని పలువురు విశ్రాంత ఉద్యోగులు మదనపడుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ఆ అధికారి వృద్ధులనే కనికరం లేకుండా అడిగినంత సమర్పిస్తే తప్ప ఫైల్ మీద సంతకాలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు సకాలంలో వచ్చేందుకు సదరు అధికారి సంతకం అవసరమవడంతో ఆయన చెప్పినంత ఇచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. ప్రశ్నిస్తే లక్షల రూపాయలు మీకు వస్తుంటే ఆ మాత్రం ఇవ్వలేరా..? అని దబాయిస్తున్నారు. అంత ఇవ్వలేమని బాధితులు వేడుకుంటున్నా కనికరం చూపడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవినీతి జలగపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



రైలు కింద పడి ఔషధ విక్రయదారుడి మృతి

కావలి : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో టోకు ఔషధ విక్రయదారుడు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం కావలి పట్టణంలోని ఉదయగిరి వంతెన సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు ఉత్తర జనతాపేటకు చెందిన **పానుగంటి మాల్యాద్రి** (50) మందుల దుకాణం నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసు అధికారి ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు.



గుర్రపు డెక్కతో దువ్వూరు కాలువ

అధికారుల చోద్యం గుత్తేదారుల ఇష్టారాజ్యం

నెల్లూరు, సంగం ఆనకట్టలు, సోమశిల జలాశయం,నెల్లూరు, సంగం బ్యారేజీల నిర్మాణంతో దాదాపు అన్ని ఏటి కాలువలు ఉనికిని కోల్పోయాయి. దువ్వూరు కాలువ మాత్రమే ఇప్పటికీ కొనసాగుతూ ఉంది. పలు గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల ఆయకట్టుకు, సాగునీటి కల్పనతో పాటు, తాగునీటి సదుపాయం కల్పిస్తుంది. అలాంటి జలవనరుని పెన్నానది నుంచి అభివృద్ధి చేయాల్సి ఉండగా, సంగం బ్యారేజి నిర్మాణ గుత్తేదారులు మాత్రం తమ లాభాపేక్ష కోసం నూతన రెగ్యులేటరు వద్ద నుంచే చేస్తుండటం ఆందోళనకరంగా ఉంది. తెలుగు గంగ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని రైతులు ఆరోపిస్తున్నారు.

సంగం, న్యూస్‌టుడే: సంగం ఆనకట్టకు 650 మీటర్ల పడమరవైపు బీరాపేరు వాగు పెన్నానదిలో కలిసే ప్రదేశంలో ప్రారంభమయ్యే దువ్వూరు కాలువ 7 కి.మీ పొడవునా ప్రవహించి దువ్వూరు చెరువులో సంగమిస్తుంది. ఆయకట్టు పరిధిలోని వివిధ కాలువలతో పాటు, చెరువును త్వరగా నింపేందుకు 500 క్యూసెక్కుల చొప్పున నీటిని తీసుకువెళ్లే సామర్థ్యంతో ఉంది. కాలువ ద్వారా నేరుగా నీటి సరఫరా జరిగే ఆయకట్టు అయిదువేల ఎకరాలు ఉంది. దువ్వూరు చెరువు ద్వారా 2,400 ఎకరాలకు నీరందుతుంది.

లాభాపేక్షతో..

ఇప్పుడు నూతన రెగ్యులేటరు సమీపంలో పెన్నానది పొర్లుకట్టకు గండి కొట్టి అక్కడ నుంచి సాగునీటి సరఫరా జరిగేలా యంత్రసాయంతో పనులు చేస్తున్నారు. కాలువ ప్రారంభ స్థానం నుంచి చేయాల్సిన పూడికతీత పనులకు గుత్తేదారులు తిలోదకాలిచ్చారు. వారి లాభాపేక్ష కోసం ఈ విధంగా జరుగుతుంటే అధికారులు మూగనోము పాటిస్తున్నారు. ఫలితంగా సంగం ఆనకట్ట వద్ద సాధారణ నీటి మట్టం ఉంటే దువ్వూరు కాలువకు నీరు లభించే అవకాశం ఉండదు. పొర్లుకట్టకు గండికొట్టడంతో పెన్నానదికి వరద ప్రవాహాలు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఇప్పటికైనా నిబంధనలకు అనుగుణంగా పనులు చేయించాలని అన్నదాతలు కోరుతున్నారు. తెలుగు గంగ ఈఈ మేకల అనీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గుత్తేదారులతో మాట్లాడి ఒప్పందం ప్రకారం పనులు చేయిస్తామన్నారు.

నిర్మాణ పనుల్లో భాగంగా

రూ.350 కోట్ల వ్యయంతో జరిగిన సంగం బ్యారేజీ నిర్మాణ పనుల్లో భాగంగా ఈ కాలువను అభివృద్ధి చేయాల్సి ఉంది. కాలువప్రారంభ స్థానం నుంచి బస్టాండు కూడలి వరకు 650 మీటర్ల పొడవునా పూడిక తొలగించి గట్లను పటిష్ఠంచేయాలి. నూతన రెగ్యులేటరు నిర్మాణం చేసి అక్కడ నుంచి పాత రెగ్యులేటరు వరకు గట్లను కాంక్రీటు లైనింగు చేయాలి. తెలుగుగంగ అధికారుల పర్యవేక్షణలో పూడికతీత పనులు జరగాలి. అయితే ఇప్పటివరకు కేవలం నూతన రెగ్యులేటరు నిర్మించి షట్టర్లు ఏర్పాటు చేశారు.



నూతన రెగ్యులేటరు వద్ద నుంచి తవ్వకం

కావలి

● కావలి ● ఉదయగిరి ● కందుకూరు

అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలి

వింజమూరు, న్యూస్‌టుడే: ఉదయగిరి నియోజకవర్గంలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ అన్నారు. స్థానిక తెదేపా ప్రధాన కార్యాలయంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ నెల 26న సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

కాలువ ఆక్రమణలు సరికాదు

గుడ్లూరు : చెంచిరెడ్డిపాలెం ఆక్రమణలో ఉన్న పంటకాలువను సబ్ కలెక్టరు శ్రీపూజ బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన కొందరు స్థల విషయంలో వివాదం ఉండటంతో ఆమెకు ఫిర్యాదు చేశారు. దీంతో క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన ఆమె నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరించాలని తహసీల్దారు స్వర్ణకు సూచించారు. **కందుకూరు పట్టణం:** ఎస్సీ వర్గీకరణ చేయొద్దని, క్రిమిలేయర్ వద్దని మాలమహానాడు ఐకాస నాయకులు సబ్‌కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. నాయకులు పాలేటికోటేశ్వరరావు, జి.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించకపోతే ఎలా?

గుడ్లూరు, కందుకూరు పట్టణం: గుడ్లూరులో ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లో ఇంతవరకు అధ్యాపకులను నియమించకపోవడంపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కావలి వెళుతున్న ఆయన కారును విద్యార్థులు ఆపారు. అధ్యాపకులు లేరని, పాఠ్యాంశాలు పూర్తికావడం లేదని వాపోయారు. దీంతో ఆయన డీఈవో రామారావుతో మాట్లాడారు. నలుగురు అధ్యాపకులను నియమించేందుకు అనుమతి ఇచ్చామని డీఈవో తెలపగా ఇక్కడ వారు లేరంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ● కర్లపాలెం వాసులకు నివాస స్థలాన్ని పంపిణీ చేసేందుకు తెట్టు- రామాయపట్నం మధ్య ఉన్న భూమిని పరిశీలించారు. ● రాళ్లపాడు నీరు కలుషితం కాకుండా చూడాలని కందుకూరు అభివృద్ధి సలహా కమిటీ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే నాగేశ్వరరావును కలిసి విన్నవించారు. నాయకులు మాజీఎమ్మెల్యే దివిశివరామ్ తదితరులున్నారు.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న కమిటీ నాయకులు

వర్షమొస్తే.. రాకపోకలు బంద్



కందుకూరు-గుడ్లూరు రోడ్డులో పొంగిన ఎర్రవాగు

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

కందుకూరు నియోజకవర్గంలో ఓ మోస్తారు వర్షం పడినా పట్టణం నుంచి మండలాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏళ్ల తరబడి నుంచి ఉంది. వాగులు, వంకలు పొంగి పొర్లి రోడ్లపై మోకాల్లోతు నీళ్లు పారుతుండటంతో సమస్య పునరావృతమవుతోంది. వర్షాకాలంలో రాత్రిళ్లు సంగతి అటుంచి పగలు కూడా అటుగా వెళ్లాలంటే సాహసం చేయాల్సిన దుస్థితి. ప్రధానంగా నేల చప్టాలు కావడం, ఇరువైపులా కనీసం రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏటా రోడ్లపై వరద నీరు పారినప్పుడు ఎత్తు వంతెనలు నిర్మించేందుకు ప్రతిపాదిస్తున్నామని అధికారులు, పాలకులు చెప్పడం.. ఆ తరువాత ఆ ఊసే ఎత్తకపోవడం పరిపాటిగా మారింది. కీలకమైన చప్టాల వద్దనైనా ఎత్తు వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ● భారీ వర్షాల సమయంలో లింగసముద్రం మండలం పెదపవని వద్ద ఉప్పుటేరు వంతెనపై సుమారు అయిదు అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. దీనికి దిగువన రెండొందల మీటర్ల దూరంలో చెక్‌డ్యాం ఉండటంతో వంతెనకు ఇరువైపులా ఎప్పుడూ పది అడుగుల నీరు నిల్వ ఉంటుంది. రెండేళ్ల క్రితం ఉప్పుటేరులో నీటి ప్రవాహం అధికమై వంతెనపై ఉన్న సిమెంటు కాంక్రీటు బిళ్లలు తొలగడంతో.. అటుగా వెళ్తున్న ఆటోబోల్తా కొట్టి ఇద్దరు మృతి చెందారు. ● కందుకూరు నుంచి చుట్టుగుంట, దివివారిపాలెం వెళ్లే రోడ్డులో సుమారు 4 చోట్ల నేల చప్టాలు న్నాయి. మోస్తారు వర్షం పడినందంటే ఆ దారుల్లో ప్రయాణం విరమించుకోవాల్సిందే. రాత్రుళ్లు చిమ్మ చీకట్లో అటుగా రాకపోకలు చేయాలంటే భయభ్రాంతులకు గురవుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఈ రోడ్డు పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోనిది. ఆ శాఖ పీఐయూ జేఈ హనుమంతరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 30 చోట్ల కల్వర్టులు, బ్రిడ్జిలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, అనుమతులు వస్తే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

● కందుకూరు నుంచి గుడ్లూరు వెళ్లే మార్గం మధ్యలో మాచవరం సమీపంలో ఉన్న వంతెన సామర్థ్యం సరిపోవడం లేదు. రక్షణ గోడలు కూడా లేవు. ఈ క్రమంలో హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.20కోట్లతో అనుమతులు మంజూరు చేసి దాదాపు ఏడాదైంది. కనీసం ఇప్పటివరకు భూసేకరణ కూడా చేపట్ట లేదు. గుడ్లూరు-పొట్లూరు మధ్యలో చప్టాను వంతెనగా చేసేందుకు గతంలో ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు. మిగిలిన వాటికి ప్రతిపాదనలు కూడా పంపలేదని ఆ శాఖ ఏఈ అహ్మద్‌బాషా తెలిపారు.

ఏళ్లుగా ఇబ్బందులు

వర్షాకాలాల్లో కందుకూరు నుంచి కొండముడుసుపాలెం, దివివారిపాలెం, ఆనందపురం, చుట్టుగుంట, బడేవారిపాలెం వెళ్లే మార్గాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు చోట్ల చప్టాలు దెబ్బతిన్నాయి. అయిదు సెం.మీ వర్షం పడినా ఎర్రవాగు పొంగి రోడ్లపైకి వరద ప్రవహిస్తుంది. దీంతో వాగు ఉద్ధృతి తగ్గేంత వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



విరిసిన ప్రతిభ



కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని గాయత్రినగర్ నలంద ఉన్నత పాఠశాలలో ఈనాడు ప్రతిభా పాటవ పోటీలను బుధవారం నిర్వహించారు. అంతర్జాలం వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు.. విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పదో తరగతికి చెందిన డి.మహేష్‌బాబు, తొమ్మిది తరగతి విద్యార్థులు బీ.రేవంత్ సాయి, సీ.చక్రిలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. పాఠశాలల సంచాలకులు వశీం, ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రమాదకరంగా రోడ్డు అంచు

ఉదయగిరి- గండిపాలెం మార్గంలో గంగిరెడ్డిపల్లి సమీపంలో రోడ్డు మార్జిన్ ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. ద్విచక్రవాహనాలు అదుపు తప్పి పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ మస్తాన్‌రావు దృష్టికి తీసుకెళ్లగా రోడ్డు, మార్జిన్లను బాగు చేసేందుకు ఎఫ్‌డీఆర్ కింద నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. **- న్యూస్‌టుడే, ఉదయగిరి**



కల్వర్టు పనులు ప్రారంభం.. రైతుల హర్షం



సోమశిల నుంచి రాళ్లపాడు జలాశయానికి నీరు ప్రవహించే ఉత్తర కాలువలో అడ్డంకులు తొలగించేందుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రూ.5లక్షల సొంత నిధులతో బుధవారం పనులు ప్రారంభించారు. కొండాపురం మండలం జిరావారిపాలెం వద్ద ఉత్తర కాలువ నీటి ప్రవాహం తక్కువగా ఉన్నట్లు గుర్తించి అధికారులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన కల్వర్టు నిర్మాణానికి నిధులు అందజేశారు. రాళ్లపాడు రైతులు హర్షం వ్యక్తంచేశారు. **- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఒంగోలులో జరిగిన క్రీడా పోటీల్లో పట్టణంలోని బాలురోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి.. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాసరావు తెలిపారు. చెస్ అండర్-17కు కట్టాకిరణ్, అండర్-14కు నిర్మల్‌జస్టిస్, పుట్‌బాల్ అండర్-14కు ఎస్.కె.సుభాని, ఆజాద్, ఆలూరిజాషువా, హాకీ అండర్-14కు ఎస్.కె.సుల్తాన్‌బాషా ఎంపికయ్యారు. హెచ్‌ఎం నరసింహమూర్తి వారిని అభినందించారు. **- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**



కలుషిత నీటిపై గ్రామస్థుల ఆందోళన

జలదంకి : చోడవరంలో జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామానికి తాగునీరందించేందుకు ఎర్ర చెరువులో బోరు వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి వరద నీరు చేరడంతో బోరు బావిలోకి ఇంకటంతో నీరు రంగుమారి కలుషిత జలం సరఫరా అవుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద కలుషితమైన నీరు చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో ఎం.బ్రహ్మయ్యకు సమస్యను తెలిపారు. జాజుల శివరామయ్య, మందపల్లి మదన్‌లు తదితరులు ఉన్నారు.

దళితులపై అక్రమ కేసులు తగదు

దగదర్తి, న్యూస్‌టుడే: మనుబోలుపాడుకు చెందిన దళితులపై అక్రమ కేసులు బనాయించడం తగదని అంబేడ్కర్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రఘు అన్నారు. ఈ విషయమై బుధవారం డిప్యూటీ తహసీల్దార్ గిరీష్‌కు ఫిర్యాదు చేశారు. సివిల్ వివాదాల్లో క్రిమినల్ కేసులు బనాయించడం దారుణమన్నారు. ఎస్పీ, కలెక్టరులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోండి

కావలి : పది లక్షల బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని అగ్రిగోల్డ్ ఖాతాదారుల, ఏజెంట్ల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో అగ్రిగోల్డ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ సంస్థ చేసిన మోసాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 19.2లక్షల మంది బాధితులయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు జీవీ ప్రసాదరావు, శంకరరావు, పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మించాలి

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని టిడ్కో గృహ సముదాయంలో రిటైనింగ్ గోడను నిర్మించాలని జనసేనపార్టీ నియోజకవర్గ బాధ్యుడు అళహరి సుధాకర్ కోరారు. బుధవారం టిడ్కో ఛైర్మన్‌గా బాధ్యతల్ని స్వీకరించిన వేములపాటి అజయకుమార్‌ను విజయవాడలో కలిసి వినతి పత్రం అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య : కాకుటూరుపంచాయతీ పరిధిలో బొంతవారిపాలెంలో బత్తినవారి కుంటకు వెళ్లే రహదారిలో వీధి దీపం వెలగడం లేదు. **- కోటయ్య**
సమాధానం : పరిశీలించి వెలగని దీపానికి మరమ్మతులు చేయిస్తా. **- అబ్దుల్‌బారి**
- న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

? కావలి పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల తీరు సరిలేదు. రోగులను పట్టించుకోవడం లేదు. ప్రైవేటు అంబులెన్స్‌లతో లాలూచీగా వ్యవహరిస్తున్నారు.
- ప్రసాద్‌బాబు, వెంగళరావునగర్
✓ అలాంటిదేమీ లేదు. రోగులకు ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించడంలో రాజీ లేదు. ప్రైవేట్ అంబులెన్స్‌ల నిర్వాహకులను ప్రోత్సహించడంలేదు. **- పద్మావతి,సూపరింటెండెంట్, కావలిప్రాంతీయాసుపత్రి - న్యూస్‌టుడే, కావలి**

? మండలంలోని చెమిడిదిపాడు ట్యాంకు వీధి చివరలో వీధి దీపాలు వెలగడం లేదు.
- వర్షిత, స్థానికురాలు
✓ పరిశీలించి వెంటనే వెలిగించే ఏర్పాటు చేస్తాను. మురళి, పంచాయతీ కార్యదర్శి, **- వర్షిత, స్థానికురాలు - న్యూస్‌టుడే, గుడ్లూరు**

? లింగసముద్రంలో కుక్కల బెడద అధికంగా ఉంది. **- సురేష్, గ్రామస్థుడు**
✓ కుక్కలను పట్టి తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. **- మాధవరావు, పంచాయతీ కార్యదర్శి, - న్యూస్‌టుడే, లింగసముద్రం**

రోడ్డుప్రమాదంలో వృద్ధుడి మృతి

కావలి : ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని మర్రి వెంకయ్య (75) దుర్మరణం పాలయ్యారు. బుధవారం పట్టణంలోని సుచేతనగర్‌కు సమీపంలో కావలి-పెదపవని రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు పెదపవని వైపు నుంచి వేగంగా వస్తున్న ఓ గుర్తు తెలియని చోదకుడు.. వెంకయ్య నడుపుతున్న టీవీఎస్ వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి తొలుత స్థానిక, అనంతరం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. కావలి రెండో పట్టణ ఎస్సై గౌస్ బాషా కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కావలి, న్యూస్‌టుడే: బట్లదిన్నెకి వెళ్లే దారిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం కొందరు గుర్తించి కావలి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రాంతీయాసుపత్రికి పోలీసులు తరలించారు. మృతుని వయసు సుమారుగా 50 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీ.రాజేశ్వరరావు తెలిపారు.

సుబ్బరాయుడు సత్రంలో స్థల వివాదం

ఉలవపాడు, న్యూస్‌టుడే: తన సొంత స్థలంలో సిమెంటు రోడ్డు నిర్మించేందుకు కొందరు వ్యక్తులు యత్నిస్తున్నారని నారిశెట్టి మాల్యాద్రి అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన చాకిచర్ల పంచాయతీ సుబ్బరాయుడుసత్రం గ్రామంలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే మాల్యాద్రి అనే వ్యక్తికి సర్వేనం.474/2లో స్థలం ఉంది. పక్కనున్న ఇంటికి రోడ్డు వేయాలని కొందరు ప్రతిపాదించారు. గత వారంలో కొలతలు తీస్తుండగా స్థలం యజమాని అడ్డుకున్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణకు, ఎంపీడీవో విజయ, తదితరులకు మౌఖికంగా తెలియజేశారు. తిరిగి బుధవారం పంచాయతీ కార్యదర్శితోపాటు వారు అక్కడికి చేరుకోవడంతో స్థలం యజమాని గొడవపడ్డారు. దాంతో వారు వెనుదిరిగారు.

ఆక్రమణకు యత్నం

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని బొట్లగుంట వద్ద స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు యత్నించడంతో స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. ఇప్పటికే అక్కడ స్థలాన్ని ఆక్రమించి మద్యందుకాణాన్ని ఏర్పాటు చేశారంటూ స్థానికులు చెబుతున్నారు. దానికి అనుబంధంగా ఉన్న స్థలాన్ని సైతం కబ్జా చేసేందుకు యత్నిస్తుండడంతో తప్పుబట్టారు.



సృజనకు పదును..

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోవూరురోడ్డులో ఉన్న నారాయణ పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. అంతర్జాలం వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు.. విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. జి.కీర్తన, బి.చేతన, బి.ప్రవీణ్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో సాధించారు. ఉపాధ్యాయులు ఎస్.కె.మస్తాన్‌వలి, ఎం.మాధవరావు, పి.వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు.

కాలువలిలా.. సాగునీరు అందేదెలా..?



జలదంకి పెద్ద చెరువు లింగనపాలెం తూము నుంచి సుమారు 500 ఎకరాలకు సాగు నీరు సరఫరా చేసే పంట కాలువ ఇది. కొనేళ్లుగా పిచ్చి మొక్కలు, పూడికతో నిండిపోవడంతో పొలాలకు సాగునీరు అందటం లేదు. కాలువను సైతం కొందరు ఆక్రమించడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదని అన్నదాతలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌టుడే, జలదంకి, ఉదయగిరి

మండలంలోని జలదంకి పెద్ద చెరువు, లింగరాజు అగ్రహారం, జమ్మలపాలెం, బ్రాహ్మణక్రాక, చామదల,వేములపాడు, గోపనపాలెం తదితర గ్రామాల్లోని చెరువుల నుంచి పొలాలకు నీరందించే పంట కాలువలు పిచ్చి మొక్కలు, పూడికతో నిండిపోయాయి. ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మండలంలో వర్షాలు కురవడంతో నారుమడులు పోసేందుకు రైతులు సిద్ధమయ్యారు. నగదు వసూలు చేసి పూడికతీత పనులు చేపట్టాలంటే తలకు మించిన భారంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బి.కె. అగ్రహారంలో పూడికతో నిండిన కాలువ

ఉపాధి హామీ పనులేవీ..?

జలదంకి మండలంలో 27 చెరువులున్నాయి. సోమశిల మేజర్, మైనర్ కాలువల ద్వారా రైతులు సుమారు 28 వేల ఎకరాల్లో ఏటా పంటలు సాగు చేస్తుంటారు. పంట కాలువలు 786 ఉన్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లోని రైతులకు ఉపయోగపడేలా పంట కాలువల్లో పూడికతీత పనులు చేపడితే ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీల తీర్మానాలు సకాలంలో అందకపోవటంతో పనులు మంజూరు కాక పూడికతీత పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు పలువురు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో పనులు చేపట్టి సాగు నీరు సజావుగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం : ఎన్.శ్యామల, ఏపీవో, ఉపాధిహామీ పథకం

ఉపాధిహామీ పథకం ద్వారా ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో పంట కాలువల్లో పూడికతీత పనులు చేశాం. మరికొన్ని గ్రామాల్లోని పూడికతీత పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో పనులు చేపట్టి పొలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

దాతల సహకారం అభినందనీయం

కొడవలూరు, న్యూస్‌టుడే: పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అవసరమని డీఈవో పీవీజే రామారావు అన్నారు. మండల పరిధిలోని యల్లాయపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో బండ్ల బంగారయ్య, కమ్మలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ హరిప్రసాద్ సహకారంతో నూతనంగా సైకిల్ స్టాండ్ నిర్మించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో డీఈవో పాల్గొని మాట్లాడుతూ దాతలు ముందుకొస్తే ప్రభుత్వ పాఠశాలలు అద్భుతంగా తీర్చిదిద్దవచ్చన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని సమస్యలు బుధవారం అధికారులు పరిశీలించారు. కమిషనర్ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో లబ్ధిదారులను స్థానిక సమస్యలడిగి తెలుసుకున్నారు. సోమశిల తాగునీటి సరఫరా, ఇతర సమస్యలు పరిష్కరించాలని అధికారులకు పలువురు విన్నవించారు.

కాకాణిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ముత్తుకూరు, న్యూస్‌టుడే: సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తూ, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారని సత్వరం చర్యలు తీసుకోవాలని ముత్తుకూరు మండల తెదేపా నాయకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ... కాకాణి మంత్రిగా ఉన్న సమయంలో మట్టి నుంచి మద్యం దాకా అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు.

సమస్య: విడవలూరు మండలంలోని గిరిజన ప్రాంతాల్లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. గిరిజనులకు కొన్నేళ్లుగా ప్రభుత్వ పథకాలు అందడం లేదు.

– శ్రీను, విడవలూరు

సమాధానం: త్వరలో ఎస్టీ కాలనీల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

–నగేశ్‌కుమారి, ఎంపీడీవో



ప్రతిభకు గుర్తింపు



కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాలం విని యోగం వల్ల కలిగే లాభనష్టాలు - విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై బుధవారం వ్యాసరచన పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఏ. సహన్(ప్రథమ), ఎస్‌కే సమీర(ద్వితీయ), సయ్యద్ ముజఫర్(తృతీయ) విజేతలుగా నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, ఉపాధ్యాయులు షరీఫ్, వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణకు మరో అవకాశం

● 25వ తేదీ వరకు మార్పులు, చేర్పులకు ప్రత్యేక శిబిరాలు

న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం), బుచ్చి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవాలంటే ఆధార్ తప్పనిసరి. అయితే ఆధార్‌లో తప్పిదాలు ఉండటంతో అధికారులు సున్నితంగా తిరస్కరిస్తున్నారు. సాంకేతిక లోపాలతో కొందరికి వేలిముద్రలు సక్రమంగా సరిపోవడం లేదు. ఫలితంగా ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. సమస్యను అధిగమించాలని ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నవీకరణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. మార్పు, చేర్పులకు మరో అవకాశం కల్పిస్తున్నారు.

జిల్లా పరిధిలోని సచివాలయాల్లో 5-18 ఏళ్ల నిండిన వారికి ఆధార్ కార్డుల్లో వేలిముద్రల నవీకరణకు అవకాశం ఉన్నట్లు ప్రభుత్వం సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో అమలు తీరుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.

సేవా రుసుములు ఇలా..

ఆధార్ కేంద్రాల్లో నవీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. పిల్లలకు సంబంధించి బాల ఆధార్, కొత్త ఆధార్ నమోదుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. 5-7, 15-17 ఏళ్ల మధ్య బాలబాలికల బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేసుకోవడానికి సేవలు ఉచితంగా పొందొచ్చు. ఇక 7-15 సంవత్సరాలు నిండిన వారు వేలిముద్రల నవీకరణకు రూ.100 వసూలు చేస్తారు. ఆధార్‌తో చరవాణి, ఈ-మెయిల్ అనుసంధానం, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, లింగం మార్పు చేసుకునేందుకు రూ.50 చొప్పున చెల్లించాలి. చిత్రం, బయోమెట్రిక్, ఐరిస్ మార్పునకు రూ.100 చెల్లించాలని ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. పనిచేస్తున్న సచివాలయంలో కాకుండా మరో ప్రాంతంలో శిబిరం ఏర్పాటుకు అవసరమైన యంత్ర సామగ్రి తరలించడానికి రూ.500, శిబిరం నిర్వహణకు రూ.వెయ్యి చొప్పున కేటాయించారు.

సద్వినియోగం చేసుకోవాలి : నాగేశ్వర ప్రసాద్, ఎంపీడీవో

ఆధార్ నమోదు, నవీకరణ చేసుకోవడానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఉత్తర్వులందాయి. అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఆధార్ పత్రాలు తీసుకురావాలి. మార్పులు, చేర్పులు చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో అమలు తీరుపై పర్యవేక్షణ చేస్తాం.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

మర్రిపాడు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కేతిగుంట పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం డీఎల్పీవో నారాయణ విచారణ చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థుల సమక్షంలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు సుంచి చిన్న పనులకు అధిక మొత్తంలో నగదు తీసుకున్నారని డీఎల్పీవో తెలిపారు. ఇక్కడ జరిగిన పలు అక్రమాలపై పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించామని, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని డీఎల్పీవో పేర్కొన్నారు.

ప్రతి మండలంలో ఇంకుడు గుంతలు నిర్మిస్తాం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జిల్లాలో భూగర్భ జలాలు పెంచేందుకు జలశక్తి అభియాన్ కింద 22 వేల ఇంకుడు గుంతలు తవ్వాలని నిర్ణయించినట్లు డ్వామా పీడీ గంగాభవానీ పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి మండలంలో వెయ్యి ఇంకుడు గుంతలు నిర్మిస్తామని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రూ.9 కోట్లతో సీసీ రోడ్లు ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైనట్లు తెలిపారు. సకాలంలో పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు

మనుబోలు, న్యూస్‌టుడే : మండలంలోని బండేపల్లి, చెరుకుమూడి రెవెన్యూ పరిధిలో రీసర్వే సమయంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని జేసీ కార్తిక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చెరుకుమూడి, బండేపల్లి రెవెన్యూ పరిధిలోని భూములను ఆయన నెల్లూరు ఆర్డీవో నాగసంతోష్ అనూషతో కలిసి పరిశీలించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసి పలు దస్త్రాలను పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ బండేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 30, 31లో, చెరుకుమూడిలోని 6, 7, 10 తదితర సర్వే నంబర్లలోని భూములను తారుమారు చేసినట్లు గ్రీవెన్సులో ఫిర్యాదులు అందాయని తెలిపారు.

జనావాసాల్లో మద్యం దుకాణం వద్దు



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న ముస్లింలు

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: తమ నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని హసనాపురం గ్రామ ముస్లింలు తహసీల్దారు శ్రీరామకృష్ణకు ఫిర్యాదు చేశారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారులకు సన్మానం

కొడవలూరు: కొడవలూరు మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఎంపీపీ జ్యోతి సమక్షంలో బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానించారు. నూతనంగా విధుల్లో చేరినవారికి పుష్పగుచ్ఛాలను బుధవారం అందించారు. ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చిత్తశుద్ధిగా పనిచేయాలని కోరారు.

ప్రమాదాల మడుగు

చేజర్ల నుంచి ఆత్మకూరు వెళ్లే మార్గంలో గొల్లపల్లి-పెరుమాళ్లపాడు మధ్య ఉన్న రహదారి గత కొన్నేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో బాగా దెబ్బతింది. ఇటీవల వర్షాలకు రహదారి మరింత దెబ్బతిని భారీ మడుగులా మారింది. వాహనదారులు నీటి మడుగుల్లో పడుతూ లేస్తూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. పంచాయతీ రాజ్ ఏఈ హరికృష్ణ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, చేజర్ల



పట్టించుకునేదెవరు

ఆత్మకూరు పురపాలక పరిధిలోని ఏఎస్‌పేట రోడ్డు కూడలి సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్తు తీగలకు పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి.. ముంబయి రోడ్డు పక్కనే ఇలా ప్రమాదకరంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. కమిషనర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ సమస్య పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు



ప్రత్యేక విజ్ఞప్తుల ఏర్పాట్ల పరిశీలన

అనంతసాగరం, న్యూస్‌టుడే: అనంతసాగరంలో 28వ తేదీ సోమవారం జరిగే ప్రత్యేక విజ్ఞప్తుల కార్యక్రమానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొననున్నారు. తహసీల్దారు ప్రాంగణంలోని బహిరంగ సభ ఏర్పాట్లను ఆత్మకూరు ఆర్డీవో పావని బుధవారం పరిశీలించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో తహసీల్దారు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

విద్యార్థులకు అభినందన

కొడవలూరు, న్యూస్‌టుడే: భూకంపాలు అంచనాపై వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఎంపీసీ విద్యార్థులు 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్రియేటివ్ రీసెర్చ్ థాట్స్' అనే సంస్థకు పరిశోధన పత్రం సమర్పించారని కళాశాల ఛైర్మన్ గుణశేఖర్ తెలిపారు. నార్తురాజుపాళెంలోని కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

బాధితులకు అండగా నిలిచాం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: వివిధ విపత్తుల సమయంలో వాసవిక్లబ్ బాధితులకు అండగా నిలిచిందని ఆ సంస్థ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ తెలిపారు. నగర పంచాయతీలోని కల్యాణమండపంలో గుడ్‌విల్ విజిట్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

భూ సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

కోవూరు, ఇందుకూరుపేట, మనుబోలు, బుచ్చి, కొడవలూరు, న్యూస్‌టుడే: కోవూరు మండలంలోని పాటూరులో రీసర్వేకు సంబంధించిన నష్టపోయిన బాధిత రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దారు నిర్మలానందబాబాకు వినతులిచ్చారు. పాటూరులో బుధవారం జరిగిన గ్రామసభలో రైతుల నుంచి రీసర్వేకు సంబంధించి 39 వినతులు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. ● రీసర్వేలో అక్రమాలకు పాల్పడి దోచుకున్న ఓ రైతు మార్చుకున్నారని, ఆ దొరువును కాపాడాలని ఇందుకూరుపేట మండలంలోని నరసాపురంలో జరిగిన గ్రామసభలో 20 మందికి పైగా ఫిర్యాదు చేశారు. ● మనుబోలు మండలంలోని పిడూరుపాళెం గ్రామంలో రీసర్వే గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ● బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు మండలాల్లో వినతులు తీసుకున్నారు.





సృజనకు పదును

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేటలోని కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా వారిలో ప్రతిభను వెలికితీసి, జ్ఞాపకశక్తితో పాటు నైతిక విలువలు పెంపొందించడంలో అంతర్జాల వినియోగం, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థినులు హాజరయ్యారు. కె.కీర్తన (ప్రథమ), ఎన్.జాహ్నవి (ద్వితీయ), హర్షిత (తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మమ్మ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు రమాదేవి, శైలజ, మాలిని పాల్గొన్నారు.

పోలేరమ్మా.. దీవించమ్మా



సైదాపురం, న్యూస్‌టుడే : దండాలమ్మా.. పోలేరమ్మా.. చల్లగా చూడమ్మా అంటూ భక్తులు బుధవారం పోలేరమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సైదాపురంలో జరుగుతున్న పోలేరమ్మ జాతర వేడుకల్లో భాగంగా గ్రామ చావిడి వద్ద ప్రత్యేక మండపంలో బుధవారం వేకువజామున అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

మౌలిక వసతులు కల్పించండి

రాపూరు, న్యూస్‌టుడే: మంజూరైన పక్కా గృహాల్లో నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేస్తే, కొత్త వారికి ఇళ్లు మంజూరు చేస్తామని గృహనిర్మాణ శాఖ ఏఈ రామకృష్ణ అన్నారు. ఎంపీడీవో ప్రసన్న అధ్యక్షతన బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు.

తమ్ముడి వాహనం.. అన్న చోరీ

సంగం, న్యూస్‌టుడే: తమ్ముడి వాహనాన్ని అపహరించిన అన్నను సంగం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. గాంధీజనసంఘానికి చెందిన జి.వెంకటేశ్వరు చెందిన బొలెరో పికప్ వ్యానుంది. తన ఇంటి ముందు సోమవారం నిలిపారు. అర్ధరాత్రి తరువాత అపహరణకు గురైంది. ఆ సమాచారాన్ని బాధితుడు సంగంలో ఉన్న సోదరుడు మల్లికార్జున దృష్టికి తీసుకురావాలని మంగళవారం సంగంకు వచ్చారు. సోదరుడే వాహనం తీసుకుని పరారైనట్లు తేలింది. మంగళవారం రాత్రి సంగం పోలీసులకు ఫిర్యాదు చేయగా సాంకేతిక సమాచారంతో పిడుగుశాళ్ల వద్ద ఉన్నట్లు గుర్తించారు. మల్లికార్జునతో పాటు వాహనం స్వాధీనం చేసుకుని బుధవారం సంగంకు తీసుకొచ్చారు.

ఉద్యోగాల పేరుతో టోకరా

వెంకటాచలం, న్యూస్‌టుడే: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి రూ.44 లక్షల వసూలు చేసి... ఉద్యోగాలు ఇప్పించకుండా మోసం చేసిన దంపతులపై వెంకటాచలం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇస్కాపాలెంకు చెందిన అక్బర్ అలీకి నెల్లూరుకు చెందిన మిత్రుల ద్వారా హైదరాబాద్‌లో నివాసముంటున్న దంపతులు పవన్, చరిత పరిచయమయ్యారు. వారి కుమారుడు ముగ్గురికీ కలిసి తాము సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి ఏడాది క్రితం అక్బర్‌అలీతో పాటు అతని మిత్రుల వద్ద సుమారు రూ.44 లక్షల వరకు వసూలు చేశారు. అప్పటి నుంచి ఉద్యోగాలిప్పించాలని అడుగుతున్నా పట్టించుకోకపోవడంతో నగదు ఇచ్చేయాలని కోరారు. వారు స్పందించకపోవడంతో మోసపోయామని గ్రహించిన అక్బర్ అలీ బుధవారం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో జారి పడి దుర్మరణం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఏటికాలువలో పడి ఉదయగిరి సుధాకర్(58) మృతి చెందారు. నెల్లూరులో నివాసం ఉండే ఇతను కరటంపాడుకు తన అన్నను చూసేందుకు వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో ఏటికాలువలో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందారు. కేసునమోదు చేసినట్లు ఎస్సై సాయిప్రసాద్ తెలిపారు.

జేసీ పరిశీలన

సైదాపురం, న్యూస్‌టుడే : చాగణంరాజుపాళెం సమీపంలోని కర్మాగారానికి దారి ఏర్పాటుపై జేసీ కార్తిక్ బుధవారం పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కర్మాగారానికి దారి ఏర్పాటు చేయాలన్న యజమాని వినతి మేరకు ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

బుచ్చిరెడ్డిపాళెం: తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో బుధవారం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించొద్దన్నారు.

కూలితేనే స్పందిస్తారా?



నక్కల వాగు వంతెన



వంతెన కూలకుండా ఏర్పాటు చేసిన ఇనుప కమ్మీలు

న్యూస్‌టుడే, అనుమసముద్రంపేట

ఏఎస్‌పేట- నెల్లూరు మార్గంలో నక్కల వాగుపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. శిథిలావస్థకు చేరడంతో ఆ మార్గంలో వెళ్లాలంటే వాహనదారులు హడలుతున్నారు. నిత్యం వందలాది బస్సులు, కార్లు, ఆటోలు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాలు రావడంతో రోడ్డు పలు చోట్ల నెర్రెలిచ్చింది. అతిక్ష్మంగా ప్రమాదకరంగా ఉన్నా సంబంధిత అధికారులు తాత్కాలికంగా ఇనుప కమ్మీలతోనే సరిపెట్టారు. వంతెన కింది భాగంలో నెర్రెలిచ్చి ఉండటంతో, ప్రమాదం జరగకుండా తాత్కాలికంగా ఇనుప కమ్మీలు ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు వేగంగా వస్తుండటంతో కంపుతోందని పలువురు వాహనదారులు చెబుతున్నారు. భారీ వర్షాలు కురిసి నక్కలవాగుకు వరదొస్తే వంతెన పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందని పలు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వంతెన బాగు చేయాలని కోరుతున్నారు. ఆర్అండ్‌బీ ఏఈ అమానుల్లా వివరణ కోరగా చరవాణిలో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

25న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పర్యటన

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి ఈనెల 25, 26వ తేదీల్లో జిల్లాలో పర్యటిస్తున్నట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలతో డ్రగ్స్ అక్రమ రవాణాను నిరోధించడంపై జిల్లాలో అమలవుతున్న విధానాలను పరిశీలిస్తారని పేర్కొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యతేజ ఆదేశాల మేరకు ప్లానింగ్ సిబ్బంది నగరంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. బుధవారం మినీబైపాస్ రోడ్డు, మాగుంట లేవుట్ తదితర ప్రాంతాల్లో స్తంభాలకు కట్టిన ఫ్లెక్సీలు, రోడ్లపై కట్టిన ఫ్లెక్సీలను తొలగించారు. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఘాట్ వద్ద రోడ్డుపై ఉన్న వ్యర్థాలను తొలగించారు.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

అజయ్‌కుమార్‌కు మంత్రి అభినందనలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): టిడ్కో ఛైర్మన్‌గా విజయవాడలోని సంస్థ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు చేపట్టిన వేములపాటి అజయ్‌కుమార్‌ను మంత్రి పొంగూరు నారాయణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి నారాయణ దగ్గర చదువుకొని ఆయన శాఖలో పనిచేయడం తన అదృష్టమన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అజయ్‌కుమార్‌కు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్ విజయవాడలో ఆయన్ను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.



అజయ్‌ను సన్మానిస్తున్న మంత్రి నారాయణ

యుద్ధప్రాతిపదికన రహదారులకు మరమ్మతులు: కమిషనర్

నెల్లూరు(నగరపాలకసంస్థ): నెల్లూరు నగరంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. బుధవారం ముత్తుకూరు రోడ్డు కూడలిలో జరుగుతున్న రోడ్డు మరమ్మతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజానీ, డీఈఈ సాయిరామ్, సిబ్బంది పాల్గొన్నారు. నగరపాలకసంస్థ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వైవో నందన్ కమిషనర్ సూర్యతేజను మర్యాదపూర్వకంగా కలిశారు.

సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతులు

నెల్లూరు (నగరపాలకసంస్థ): నెల్లూరు నగరపాలకసంస్థలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న వి.పద్మావతి, ఎంఏఎస్ సిద్ధిఖ్‌లకు సూపరింటెండెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. ఈ మేరకు బుధవారం కార్యాలయంలోని ఛాంబరులో కమిషనర్ సూర్యతేజ ఉత్తర్వులను అందించారు.

మద్యం దుకాణాల ఏర్పాటుపై నిరసనలు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు వద్దని మహిళలు నిరసనలు చేపట్టారు. దుకాణాల ప్రారంభం నాటి నుంచి ఆయా ప్రాంతాల్లో స్థానికులు ధర్నాలు చేస్తున్నారు. ఈక్రమంలో బుధవారం జగదీష్ నగర్, శ్రీనివాసనగర్, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి.

బాధితులకు చెక్కుల పంపిణీ

నెల్లూరుగ్రామీణం: ముగ్గురికి రూ.3 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అందజేశారు. నగరంలోని మాగుంటలేఅవుట్ తెదేపా కార్యాలయంలో బుధవారం వీటి పంపిణీ కార్యక్రమం జరిగింది.

క్రీడాకారులకు అభినందనలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : ఇటీవల జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో గెలుపొంది రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

ఐటీఐల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య): ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి అయిదో విడత విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెంకటేశ్వరపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, సందేహాలు ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు అదే ఐటీఐ కళాశాలలో 27వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల లోపు ధ్రువపత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. వీరికి ప్రభుత్వ ఐటీఐలో 28వ తేదీన కౌన్సెలింగ్, ప్రైవేట్ ఐటీఐలో చేరేవారికి 30వ తేదీన నిర్వహించనున్నామన్నారు.

కుక్కల సమస్యకు పరిష్కారం

- పశువులు కనిపిస్తే గోశాలకే
- 'న్యూస్‌టుడే'తో వెటర్నరీ అధికారి డాక్టర్ మదన్‌మోహన్

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)



ప్రజలకు పెద్దసమస్యగా మారిన కుక్కలు, నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న పశువుల నిరోధానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలకసంస్థ వెటర్నరీ అధికారి డాక్టర్ మదన్‌మోహన్ వెల్లడించారు. నగర వీధుల్లో పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. వీటితో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కుక్కలైతే గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రిళ్లు వీధుల్లో వెళ్లే వారిని వెంటబడుతున్నాయి. వీటి కారణంగా ద్విచక్ర వాహనచోదకులు పడి గాయపడుతున్నారు. ఈనేపథ్యంలో వీటిని నియంత్రించడానికి పక్కాగా చర్యలు తీసుకుంటున్నామని వెటర్నరీ అధికారి డాక్టర్ మదన్‌మోహన్ తెలిపారు. వీటిని ఎలా నియంత్రిస్తున్నారన్న విషయాలపై 'న్యూస్‌టుడే'తో ప్రత్యేకంగా మాట్లాడారు.



నగరంలోని కుక్కలను పడుతున్న సిబ్బంది

జిల్లా కేంద్రంలో ఏబీసీ సెంటరు

నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం (ఏబీసీ) సెంటరులో కుక్కలకు ఆపరేషన్లు చేస్తాం. శస్త్ర చికిత్సలు చేసిన తర్వాత 5 నుంచి 10 రోజుల పర్యవేక్షణలో ఉంచి ఆహారం అందిస్తాం. కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసేందుకు 12 మంది సిబ్బంది ఉన్నారు. మరో రెండు బృందాలు నగరంలోని కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసేందుకు ప్రత్యేక వాహనంలో తీసుకొస్తాయి. మరో బృందం నగరంలో కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేస్తోంది.

21,530 శునకాలకు శస్త్రచికిత్స

నగరంలోని 54 డివిజన్లలో సంచరిస్తున్న 27,500 కుక్కలను గుర్తించాం. వాటిలో 21,530లకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేశాం. సంతానోత్పత్తి నియంత్రణకు ఆపరేషన్లు చేయడంతో పాటు ఎవరినైనా కరిచినా ఏమీ కాకుండా ఉండేందుకు యాంటీ రేబిస్ టీకాను వేశాం. శస్త్రచికిత్సలు చేసిన వాటిని పిచ్చి కుక్కలు కరిచినా ఏమీ కాదు. శస్త్రచికిత్సలు చేసిన తర్వాత ఎక్కడైతే పట్టుకుని వచ్చామో.. అదే ప్రాంతంలో వదులుతాం. రెండు సార్లు ఫొటోలు తీస్తాం. సొంతంగా పెంచుకునే కుక్కలకు లైసెన్సు తీసుకోవాలి.

గోశాలకు 62 ఆవులు : నగరంలోని రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న ఆవులను గోశాలకు తరలిస్తున్నాం. నగర వ్యాప్తంగా 400 వరకు పశువులు ఉన్నాయి. వాటిలో ఇప్పటికే 62 కల్లూరుపల్లి గోశాలకు తరలించాం. రోడ్లపై వదలకుండా యజమానులు సొంత ప్రదేశంలో కట్టేసి పోషించుకోవాలి.

పందులపై స్పెషల్ డ్రైవ్ : ప్రజల ఆరోగ్యం దృష్ట్యా నగరంలోని పందులను వాటి యజమానులు నగరానికి దూరంగా పెంచుకోవాలి. బయటకు ఎవరూ వదలకూడదు. ఇటీవల పట్టించి అడవుల్లో వదిలాం.

కోతులు పట్టించేందుకు ప్రత్యేక చర్యలు : నగరంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కోతులను పట్టించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. బోన్లు ఏర్పాటు చేసి పట్టించి అడవుల్లోకి తీసుకెళ్లి వదులుతున్నాం. ఒక్కోదాన్ని పట్టుకొనేందుకు రూ.450 ఖర్చు చేస్తున్నాం.

పైపులైనుకు మరమ్మతులు

నెల్లూరు(నగరపాలక సంస్థ, జడ్పీ), న్యూస్‌టుడే: నగరంలోని శాంతినగర్ కూడలి నుంచి పైపులైన్ పనులను ప్రారంభించారు. ఓ ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో గతంలో నిలిపివేసిన ప్రాంతాల్లో పనులను ప్రారంభించినట్లు స్థానిక సిబ్బంది వివరించారు. ప్రస్తుతం శాంతినగర్ వద్ద ప్రారంభమైన ఈ పైపులైన్ పనులు ఫత్తేఖాన్‌పేట రైతుబజార్ వరకు సాగుతాయని సిబ్బంది తెలిపారు.

ప్రతిభా కిరణాలు





నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని దర్గామిట్టలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'అంతర్జాల వినియోగం - విద్యార్థులపై సామాజిక మాధ్యమాల పాత్ర' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి స్థానంలో ఎ.ఎస్.సాయిప్రియ, ద్వితీయ స్థానంలో యు.శ్రీలేఖ, తృతీయ స్థానంలో పి.జునైద్ నిలిచారు. వీరికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి బహుమతులు అందజేశారు.

భూకబ్జాల పార్టీ వైకాపా: తెదేపా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భూకబ్జాల పార్టీ వైకాపా అని నెల్లూరు పార్లమెంట్ తెదేపా అధికార ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఆరోపించారు. 13వ డివిజన్ తెదేపా కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ 13వ డివిజన్‌లో తెదేపా జెండా దిమ్మె కడుతుంటే వైకాపా నాయకుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆక్రమణలకు పాల్పడుతున్నామని అనడం దారుణమన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

పొదలకూరు రోడ్డు.. పదడుగులకో గుంత

నగరంలోని పొదలకూరు రోడ్డులో పది అడుగులకు ఓ గుంతతో అధ్వానంగా తయారైంది. రోడ్డు మధ్యలో ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత పెద్దవిగా మారాయి. ఈమార్గంలో నిత్యం రాకపోకలు జరుగుతుంటాయి. గుంతలు పూడ్చిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)



ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సులభం



క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించి చికిత్స పొందితే ప్రాణాలతో బయటపడవచ్చని అపోలో హాస్పిటల్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరాం సతీష్ పేర్కొన్నారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ మాసం సందర్భంగా ఆసుపత్రిలో బుధవారం సమావేశం నిర్వహించారు. రొమ్ము క్యాన్సర్ పరీక్షలకు సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆంకాలజీ సర్జన్ డాక్టర్ బి.మనోభిరామ్, ఫిజీషియన్ డాక్టర్ సి.హరిత పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

నాణ్యమైన విద్యుత్తు అందించాలి

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.విజయన్ పేర్కొన్నారు. బుధవారం కోటమిట్టలోని విద్యుత్తు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లపై అవగాహన పెంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీధర్, డీఈఈలు అశోక్, సునీల్, కిరణ్, అసిస్టెంట్ ఇంజనీర్లు విజయ్‌కుమార్, సుధాకర్, లక్ష్మీనారాయణ, రమణ, సురేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.
–నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే



ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం నాశనం



సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడితే సహించేది లేదని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోవింద, జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సిద్ధానాయక్ హెచ్చరించారు. బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ బాషా, వైద్యులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు (జీజీహెచ్)

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: ఉస్మాన్‌సాహెబ్‌పేట రామ్‌నగర్ పిండిమిల్లు వీధిలో యూపీ8/ఎ1/2 స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. రాత్రయితే చీకటిగా ఉంటుంది. – సుమన్

? నవలాకులతోట దొడ్ల సుబ్బారెడ్డి కాలనీలోని ఎస్ఎస్30/ఎ7 స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. 30 రోజులుగా చీకటి నెలకొంది. – శైలజ

? వనంతోపు మినీబైపాస్ రోడ్డులో హెచ్‌పీ89/బీ72/1 స్తంభానికి విద్యుద్దీపం కాలిపోయింది. – రాజగోపాల్

✓ ఆయా ప్రాంతాల్లో విద్యుద్దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

(పై సమస్యలకు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ సమాధానాలు చెప్పారు.)
– న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

27న వక్తృత్వ పోటీలు

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: మైసూరు దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానందస్వామి దివ్య నామ సంకీర్తల గానం, వక్తృత్వ పోటీలను ఆదివారం ఉదయం 9 గంటలకు దర్గామిట్ట సుజాతమ్మ కాలనీలోని శ్రీ కృష్ణయోగ మందిరంలో శ్రీ గణపతి సచ్చిదానంద శ్రీకృష్ణ జ్ఞానబోధ సభా ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్టు ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 4 నుంచి 7వ తరగతి లోపు విద్యార్థులకు 'గురు రూప అవతారాలు', 8 నుంచి 10వ తరగతి లోపు విద్యార్థులకు 'పురాణాల స్మృతుల ప్రకారం ధర్మం, భక్తి, జ్ఞానం అంటే ఏమిటి' అనే అంశాలపై పోటీలు జరుగుతాయన్నారు.

అయోడిన్ లోపంతో పిల్లల్లో రుగ్మతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అయోడిన్ లోపం వలన పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతినడంతో పాటు, బలహీనమైన పనితీరు కనబరుస్తారని జిల్లా ఫ్లోరోసిస్ అధికారిణి డాక్టర్ సీహెచ్ దివ్య తెలిపారు. అయోడిన్ లోప రుగ్మతల నివారణ వారోత్సవాలు నగరంలోని ఈఎస్ఆర్ఎమ్ స్కూల్‌లో బుధవారం జరిగాయి.

కుర్తాళం పీఠాధిపతికి ఘనస్వాగతం

నెల్లూరు(సాంస్కృతికం): పప్పులవీధిలో పునర్నిర్మించిన సౌభాగ్య సరస్వతి అమ్మవారి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలకు బుధవారం రాత్రి నెల్లూరుకు విచ్చేసిన కుర్తాళం సిద్ధేశ్వరి పీఠం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతికి ఆలయ నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. వేదాయపాలెం అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద నుంచి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమ ప్రధానాచార్యులు, కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రమేష్ శర్మ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పల్లకిపై ఊరేగుతున్న సిద్ధేశ్వరానందభారతి

నగదు కోసం బెదిరించిన ఇద్దరి అరెస్టు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: మద్యం కోసం ఓ వ్యాపారిని నగదు డిమాండ్ చేసి కత్తితో బెదిరించిన ఇద్దరు యువకులను వేదాయపాలెం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వేదాయపాలెం చంద్రమౌళినగర్ 5వ వీధిలో సుబ్బారావు శ్రీకృష్ణసాయి ప్రొవిజన్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ నెల 22వ తేదీ రాత్రి జ్యోతినగర్‌కు చెందిన సాజిద్, విజయకుమార్‌లు దుకాణం వద్దకు వెళ్లి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేవని చెప్పడంతో వారు కత్తి చూపించి డబ్బులు ఇవ్వకుంటే చంపుతామని బెదిరించడంతో రూ.500 నగదు ఇవ్వగా వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వేదాయపాలెం పోలీసులు బుధవారం నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

రాజరాజేశ్వరి దేవికి ఆభరణాల బహూకరణ

నెల్లూరు(సాంస్కృతికం): దర్గామిట్టలోని రాజరాజేశ్వరి అమ్మవారికి దాతలు జి.జగన్నాథరావు, పుష్పారావు బంగారు పూత కవచాన్ని బహూకరించారు. బుధవారం దేవస్థానంలో అమ్మవారికి కవచం, కిరీటం, హస్తాలు, పాదాలు, కర్ణ పత్రాలను తయారు చేయించి అందించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దనరెడ్డి పాల్గొన్నారు.



రాజరాజేశ్వరికి బహూకరించిన కిరీటం కవచం

తెరపై ఈనాడు

ఎం-1 సినిమాస్- స్క్రీన్1.. విశ్వం, స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. వెట్టయ్యన్, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)- స్క్రీన్1.. వెట్టయ్యన్, స్క్రీన్2.. జనక ఐతే గనక, స్క్రీన్3.. ది వైల్డ్ రోబోట్, స్క్రీన్4.. విశ్వం, స్క్రీన్5.. దేవర, రెయిన్‌సినిమాస్-స్క్రీన్1.. దేవర, దివైల్డ్ రోబోట్, విశ్వం, స్క్రీన్2.. విశ్వం, దేవర, స్క్రీన్3.. వేట్టయాన్, స్క్రీన్4.. విశ్వం, లవ్‌రెడ్డి, సిరిమల్లీ ఫ్లెక్స్.. స్క్రీన్1.. దేవర, స్క్రీన్2.. వెటయ్యన్, విశ్వం స్క్రీన్3.. విశ్వం, వేట్టయాన్, స్క్రీన్4.. జనక అయితే గనక

ఎర్రచందనం కూలీలు..

సుండుపల్లి : ముడుంపాడు అటవీ పరిధిలో మంగళవారం జరిగిన దాడుల్లో తొమ్మిది ఎర్రచందనం దుంగలతో పాటు తమిళనాడుకు చెందిన ఇద్దరు కూలీలను అరెస్టు చేశామని సానిపాయి రేంజి అధికారి వైసీరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో పారిపోయిన వారి కోసం గాలిస్తుండగా అన్నమయ్య జిల్లా రాయవరం పరిధిలోని మోరుదరి ప్రాంతంలో మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన బి.చిన్నానాయక్, వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన మల్లికార్జున, నెల్లూరుకు చెందిన రామాంజనేయులు ఉన్నారన్నారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరిచామన్నారు.

మహిళలు రోడ్డెక్కుతున్నారు : వైకాపా

నెల్లూరు(నగరపాలకసంస్థ) : ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మహిళలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జగదీష్‌నగర్‌లో జాతీయ రహదారి వద్ద మద్యం షాపు ఏర్పాటుపై మహిళలు ధర్నా చేయగా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జయలక్ష్మి, మహేష్, నాయకులు ఖలీల్‌అహ్మద్, జయరామిరెడ్డి, హంజాహుస్సేనీ పాల్గొన్నారు. తెదేపా నాయకుల అక్రమ నిర్మాణంపై ప్రశ్నించిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిపై ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున తెలిపారు.

ఈ ట్రాఫిక్ పోస్టులు ఎందుకో?

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు నగరంలో ఏర్పాటుచేసిన పోలీసు ట్రాఫిక్ పోస్టులు దిష్టిబొమ్మల్లా మారాయి. ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయి. అక్కడ సిబ్బందిని కేటాయిస్తే ట్రాఫిక్ సమస్య తీరనుంది. వీటి దగ్గర ఎవరూ లేకపోవడంతో అలంకారప్రాయంగా తయారయ్యాయి.



అయ్యప్పగుడి

ప్రధాన కూడళ్లలో..

నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేశారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూసేందుకు వీటిలో సిబ్బంది ఉంటారు. ఇలా అయ్యప్పగుడి నుంచి వేదాయపాలెం, కేవీఆర్ పెట్రోల్ బంకు, ఆర్టీసీ డిపో, మద్రాసు బస్టాండు, వీఆర్సీ సెంటరు, గాంధీబొమ్మ, కనకమహల్ సెంటరు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. కానీ వీటిలో విధులు నిర్వహించేందుకు సిబ్బందిని నియమించడం లేదు. ఆయా ప్రాంతాల్లో దిష్టిబొమ్మల్లా ఉన్నాయి.



మద్రాసు బస్టాండు